క్లుప్తంగా

'నల్లా నీళ్లు రావడం లేదు'

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలోని పదో వార్డులోని బస్టాండ్ ఏరియాలో కొన్ని ఇళ్లకు నల్లాల ద్వారా నీళ్లు రావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టిఫిన్, చికెన్ సెంటర్లు ఇతర పలు వ్యాపార సంస్థల యజమానులు తమ భవనాల్లో ఉన్న నల్లాలకు కరెంట్ మోటార్లు బిగించడంతో వాటి పక్కన ఉన్న ఇళ్లలోని నల్లాల ద్వారా నీళ్లు రావడం లేదని ఆరోపించారు. కరెంట్ మోటార్లు పెట్టి, నీళ్లు లాగేస్తున్నారని మున్సిపల్ అధికారులకు చెప్పినా.. పట్టించుకోవడం లేదని వాపోయారు. కరెంట్ మోటార్లు పెడుతున్న వారిపై చర్యలు తీసుకొని అందరికి నీళ్లు సమానంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

డప్పులు అందజేత


డప్పులు అందజేస్తున్న వెంకట్‌రామిరెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దంతన్‌పల్లి గ్రామానికి చెందిన పలువురి కుల వృత్తుల వారికి పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి మంగళవారం తన సొంత నిధులతో డప్పులు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ఆటోడ్రైవర్ల శ్రమదానం


రోడ్డుపై గుంతలు పూడ్చుతున్న డ్రైవర్లు

కౌడిపల్లి(నర్సాపూర్): ఆటో డ్రైవర్లు శ్రమదానం చేసి, రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చివేశారు. మంగళవారం మండలంలోని వెంకట్రావ్‌పేట ఆటోయూనియన్ ఆధ్వర్యంలో వెంకట్రావ్‌పేటగేట్ నుంచి ముట్రాజ్‌పల్లి, రాజిపేట, వెంకటాపూర్(ఆర్) వరకు సుమారు 6 కిలోమీటర్ల పరిధిలో పలు చోట్ల బీటీరోడ్డుపై గుంతలను సీఐటీయూ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు పూడ్చివేశారు.

గ్రామసభలు నిర్వహించాలి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనుల ఎంపిక కోసం గ్రామసభలు నిర్వహించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీలందరికి పనులు కల్పించేందుకు మట్టిరోడ్డు, ఫాంపండ్, పూడిక తీత, చెరువుమట్టి తరలింపు తదితర పనులు ఎంపిక చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేయాలని చెప్పారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా గ్రామసభలు నిర్వహించాలని ప్రజలకు గ్రామాభివృద్ధి, స్వచ్ఛభారత్ గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ పుణ్యదాస్ తదితరులు పాల్గొన్నారు.

విమర్శలు చేయడం సరికాదు: మున్సిపల్ చైర్‌పర్సన్

తూప్రాన్: తమపై విమర్శలు చేయడం సమంజసం కాదని తూప్రాన్ మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ ఆరోపించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి సమయపాలన పాటించకుండా సమావేశం ముగిసిన తర్వాత వచ్చి తమ సమస్యలు వినకుండా పారిపోయారని అనడం సరికాదన్నారు. రాఘవేందర్‌గౌడ్‌ను పదవి నుంచి తొలగించడంతో జీర్ణించుకోలేక మహిళా చైర్‌పర్సన్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తే పరువు నష్టం దావా వేస్తానని మున్సిపల్ మాజీ చైర్మన్ రాఘవేందర్‌గౌడ్‌ను హెచ్చరించారు. సమావేశంలో వైస్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు జ్యోతిరవీందర్‌గుప్తా, భగవన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజు, నాయకులు పాల్గొన్నారు.

నోటీసుల అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): ట్రిపుల్‌ఆర్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు మంగళవారం రెవెన్యూ సిబ్బంది నోటీసులు అందజేశారు. రత్నపూర్, సీతారం తండా, పాంబండ, కొంతన్‌పల్లి గ్రామాల్లో బాధిత రైతులకు నోటీసులు ఇచ్చారు. కొంతన్‌పల్లిలో భూములు కోల్పోతున్న రైతులకు సంబంధించి తప్పులు ఉండడంతో నోటీసులు తీసుకోలేదు.

దొంగల బీభత్సం

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో గుర్తు తెలియని దుండగులు పలు ఇంటి తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన రేగుల ఎల్లవ్వకు ఇంట్లో 20 తులాల వెండి, బంగారు కమ్మలు 2 తులాలు, కొంత నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. పంపరి స్వరూపకు చెందిన ఇంట్లో కొంత నగదు, అర్ధ తులం బంగారం దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముందస్తు బతుకమ్మ సంబురాలు


శివ్వంపేట(నర్సాపూర్): ఉన్నత పాఠశాలలో బతుకమ్మల సందడి

జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. తీరొక్క పువ్వులతో మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు బతుకమ్మలను అందంగా తీర్చిదిద్ది, ఆటపాటలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. దీంతో ఏ పాఠశాలల్లో చూసినా.. సందడి వాతావరణం కనిపించింది. అనంతరం బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేశారు.


కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు


కొల్చారం(నర్సాపూర్): రంగంపేట ఉన్నత పాఠశాలలో..


పెద్దశంకరంపేటలో బతుకమ్మలతో ఉపాధ్యాయులు


పాపన్నపేటలో..


రేగోడ్(మెదక్): మోడల్ స్కూల్లో ..


నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ శివాలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు


నిజాంపేటలో..


వెల్దుర్తిలో ..


టేక్మాల్ మోడల్ స్కూల్లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు


చిలప్‌చెడ్(నర్సాపూర్): సోమక్కపేట్‌లో..


చేగుంట పాఠశాలలో బతుకమ్మలతో ఉపాధ్యాయులు, విద్యార్థినులు


చిన్నశంకరంపేట(మెదక్): గజగట్లపల్లి పాఠశాలలో..


మనోహరాబాద్ ఉన్నత పాఠశాలలో...

'బతుకమ్మ'కు ఏర్పాట్లు చేయాలి

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామాల్లో బతుకమ్మ ఉత్సవాలకు ప్రత్యేక అధికారులు, గ్రామ కార్యదర్శులు కలిసి ఏర్పాట్లు చేయాలని నార్సింగి మండల ప్రత్యేక అధికారి దామోదర్ సూచించారు. మంగళవారం నార్సింగి మండల పరిషత్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు లేనందున గ్రామాల్లో అధికారులే పరిసరాల పరిశుభ్రత, వీధి దీపాల ఏర్పాట్లు చేయాలని తెలిపారు. గ్రామ కార్యదర్శులు మాట్లాడుతూ.. వీధి దీపాల ఏర్పాటు సమయంలో దసరా, బతుకమ్మ పండుగ ఉన్నందున ట్రాన్స్‌కో అధికారులు, గ్రామ కార్యదర్శులతో సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. అక్టోబర్ 2న ప్రతీ గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని ఎంపీడీఓ ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కరీం, ఎంపీఓ షేక్ సైదా, ఏపీఓ రాజేశ్వర్, మెడికల్ ఆఫీసర్ రవి కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ మన్నన్

తల్లిదండ్రులే మొదటి దేవుళ్లు


నర్సాపూర్: వృద్ధులతో మాట్లాడుతున్న జడ్జి

జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్‌పర్సన్ అనిత

నర్సాపూర్: తల్లదండ్రులే మనకు మొదటి దేవుళ్లని జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్‌పర్సన్ అనిత అన్నారు. మంగళవారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని విజన్ ఓల్డ్ ఏజ్ హోంలోని వృద్ధులను, ఆశ్రమం నిర్వాహకుడు సుదర్శన్ రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తల్లిదండ్రులను దైవంతో సమానంగా పూజించాలని హితవు పలికారు. సీనియర్ సిటిజన్స్‌పై ఎవరైనా అలసత్వం వహిస్తే చట్టపరంగా శిక్షింపబడుతారని హెచ్చరించారు.

వృద్ధులకు సన్మానం

నర్సాపూర్: ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని విజన్ ఓల్డ్ ఏజ్ హోంలోని వృద్ధులను అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, ఎంపీడీఓ మధులత, మున్సిపల్ కౌన్సిలర్లు బుచ్చేష్‌యాదవ్, రాంచందర్, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణరావు, మేనేజర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఓల్డ్ ఏజ్ హోంలోని వృద్ధులకు బగిలీస్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. బగిలీస్ ఫౌండేషన్ చైర్మన్ నర్సింగ్‌సాగర్, ఇతర ప్రతినిధులు కవిత, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

'అప్రూవల్ మందులనే విక్రయించాలి'

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వం అప్రూవ్ చేసిన మందులనే మెడికల్ షాపు యజమానులు విక్రయించాలని జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చంద్రకళ పేర్కొన్నారు. మంగళవారం మెదక్ సమీకృత కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ప్రతీ నెల మెడికల్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేస్తామన్నారు. ఇటీవల ప్రభుత్వ అనుమతి లేకుండా ఫుడ్ తయారీ అనుమతితో తయారు చేసిన మెడిసిన్ పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. మెడికల్ షాపుల యజమానులు కాలం చెల్లించిన మందులు, టాబ్లెట్స్ విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరు కూడా మందులు విక్రయించకూడదని తెలిపారు. జిల్లాలోని శివ్వంపేట, మనోహరబాద్ మండలాల్లో మందుల తయారీ పరిశ్రమలు ఉన్నట్లు తెలిపారు. అలాగే జిల్లాలో హోల్‌సెల్ మందుల విక్రయషాపులు 24, రిటైల్ అండ్ హోల్‌సేల్ షాపులు 22, రిటైల్ మెడికల్ షాపులు 435 ఉన్నట్లు తెలిపారు. గత మూడు నెలల్లో మరో 20 మెడికల్ షాపుల లైసెన్స్‌లు రద్దు చేసుకున్నట్లు తెలిపారు.

ప్రేమ వ్యవహారంలో మనస్తాపం చెంది..

యువతి ఆత్మహత్య


యువతి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

శివ్వంపేట (నర్సాపూర్): ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండల పరిధి దంతన్‌పల్లిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ... గ్రామానికి చెందిన కే అంజలి(21) ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తుంది. ప్రేమ వ్యవహారం విషయమై మనస్తాపం చెంది గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు కేసు దర్యాప్తులో ఉంది.

వేధింపులపై మౌనం వీడి రక్షణ పొందండి

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి


మెదక్ మున్సిపాలిటీ: మహిళలు, విద్యార్థినులు, బాలికలు మౌనం వీడి వేధింపులపై షీటీంకు సమాచారం ఇచ్చి రక్షణ పొందాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ నెలలో షీటీం ఆధ్వర్యంలో జిల్లాలో పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో ఎవరైనా బాధిత మహిళలు షీటీమ్‌కు ఫిర్యాదు చేయాలంటే ముందుగానే తమ మొబైల్ నందు క్యూఆర్ కోడ్ స్కానర్‌ను కలిగి ఉండాలని తెలిపారు. షీటీమ్ వాట్సాప్ నంబర్ 87126 57963, 63039 23823 పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 87126 57888లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

మంత్రిపై అసభ్య పోస్టులు పెట్టిన వ్యక్తిని శిక్షించాలి

మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

మెదక్‌జోన్: మంత్రి కొండా సురేఖపై సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి మంగళవారం అన్నారు. అసభ్యంగా పోస్టులు పెట్టింది ఏ పార్టీకి చెందిన వ్యక్తి అయినా ఉపేక్షించవద్దన్నారు. మహిళలపై అసభ్యంగా వ్యవహరించే వారిపై కఠినంగా వ్యవహరించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు.

రేపటి నుంచి చాముండేశ్వరి నవరాత్రులు


గర్భగుడిలో కొలువైన అమ్మవారు

చిలప్‌చెడ్(నర్సాపూర్): భక్తుల కొంగు బంగారంగా వెలసిల్లుతోంది చాముండేశ్వరి అమ్మవారు. మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామ సమీపంలో మంజీరా తీరాన పచ్చటి పొలాల మధ్యన ఈ ఆలయం వెలసింది. దక్షిణ భారతదేశంలో రెండో అతి పెద్ద ఆలయంగా ప్రసిద్ధి చెందింది. ఆలయంలో చాముండేశ్వరి అమ్మవారు శక్తి స్వరూపిణిగా, తొమ్మిది అడుగుల ఎత్తు, పద్దెనిమిది చేతులతో జ్వాలా కిరీటం ధరించి భక్తులకు దర్శనమిస్తోంది. 3వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహాపూజ, మహానివేదన, హారతి వైభవంగా జరుగుతాయని ఆలయ అర్చకులు తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో చాముండేశ్వరి అమ్మవారు ఒకటే అవతారంలో పూజలు అందుకోవడం ఇక్కడి ప్రత్యేకత.


ఆలయానికి చేరిక ఇలా..

హైదరాబాద్ నుంచి సంగారెడ్డి, జోగిపేట మీదుగా చాముండేశ్వరి దేవి ఆలయాన్ని చేరుకోవచ్చు. మెదక్ వైపు నుంచి జోగిపేట మార్గం, నర్సాపూర్ నుంచి జోగిపేటకు వెళ్లే మార్గం ద్వారా చాముండేశ్వరి ఆలయాన్ని వెళ్లొచ్చు.

దుర్గా భవాని సేవా సమితి అధ్యక్షుడిగా కోటేశ్వరరావు

తూప్రాన్: దుర్గా భవాని సేవా సమితి నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోటేశ్వరరావు, ఆర్గనైజర్లుగా సురేష్‌గౌడ్, శ్రీహరి, విఠల్, మహేశ్‌గౌడ్, శంకరముపేట్, నాగరాజు, పోచేందర్, వెంకటేష్, ఉపాధ్యక్షులుగా జానకిరామ్‌గౌడ్, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, వేణుగోపాల్, ఉడుత శ్రీనివాస్, ముఖ్య సలహాదారులుగా అశోక్ కుమార్‌గౌడ్, వెంకట్‌నారాయణ, రమ్య, ప్రధాన కార్యదర్శులుగా నాగరాజు, రాముని గారి, తరుణ్, సతయ్యానారాయణ, మధు, తదితరులు ఎన్నికయ్యారు.

నల్లబ్యాడ్జీలతో ఏఈఓల నిరసన


రేగోడ్(మెదక్): నిరసన తెలుపుతున్న ఏఈఓలు

పెద్దశంకరంపేట(మెదక్): రాష్ట్ర జేఏసీ(వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం) పిలుపు మేరకు మండలంలోని ఏఈఓలు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు పనిభారం ఎక్కువ అవుతుందని, డిజిటల్ క్రాప్ సర్వే బాధ్యతలు అప్పగించొద్దని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారం ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను తెలంగాణలో కూడా అమలుచేయాలని వారు డిమాండ్ చేశారు. మంగళవారం రైతు వేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు మమత, వినీత్, అఖిల్‌హుస్సేన్ తదితరులున్నారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో ఏఈఓలు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. డిజిటల్ సర్వే యాప్‌లో సాంకేతిక సమస్యతో తమను గైర్హజరుగా గుర్తించడంతో ప్రభుత్వానికి తమ నిరసన వ్యక్తం చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మధులిక, శ్యామ్, నాగేంద్ర, శేఖర్ పాల్గొన్నారు.

రేగోడ్‌లోని రైతువేదికలో..

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లోని రైతువేదిక కార్యాలయంలో ఏఈఓలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఈఓలు సునీల్ కుమార్, భూలక్ష్మి, కావ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన డిజిటల్ క్రాప్ సర్వే యాప్ విధానంలో ఉన్న సమస్యలను ప్రభుత్వానికి విన్నవించినా పరిష్కరించలేదని తెలిపారు.

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట రైతు వేదికవద్ద వ్యవసాయ విస్తరణ అధికారులు మంగళవారం నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అశోక్‌రెడ్డి, ప్రశాంత్, మాధవి, శోభారాణి, కళ్యాణి, రేణుక తదితరులు ఉన్నారు.

డిజిటల్ క్రాప్ సర్వే మేము చెయం

చిలప్‌చెడ్(నర్సాపూర్): డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్) తలకుమించిన భారమని, ఈ సర్వే మేము చేయాలేమని ఏఈఓలు కృష్ణవేణి, భూపాల్ నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని రైతువేదికలో జరిగే వీడియో కాన్ఫరెన్స్‌కు నల్లబ్యాడ్జీలతో హాజరయ్యారు.

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలో నల్లబ్యాడ్జీలతో నిరసన చేసిన వారిలో ఏఈఓలు వినిత, భవాని, రోజా, అనిత, దివ్య శ్రీ, రాజశేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఎంబీబీఎస్‌లో ఫ్రీ సీటు సాధించిన విద్యార్థి**



నర్సాపూర్: పట్టణంలోని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ బాలుర గురుకులంలో చదివిన విద్యార్థి ఎంబీబీఎస్‌లో ఫ్రీ సీటు సాధించారు. మండలంలోని మూసాపేటకు చెందిన మహ్మద్ అమీర్ వుద్దీన్ పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కాలేజీలో చదివి, నీట్ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 3385 ర్యాంకును, జాతీయ స్థాయిలో 1,83,076 ర్యాంకును సాధించాడు. దీంతో వరంగల్‌లోని ప్రతిమ మెడికల్ కాలేజీలో ఫ్రీ ఎంబీబీఎస్ సీటు సాధించాడు.

◆ **జాతీయ భావాలు పెంపొందించాలి**

రామాయంపేట(మెదక్): విద్యార్థుల్లో జాతీయ భావాలు పెంపొందించాలని ఏబీవీపీ మెదక్ విభాగ్ సంఘటనా కార్యదర్శి లక్ష్మణ్ అన్నారు. మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సంఘం పతిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్ నూతన నగర కార్యవర్గాన్ని ప్రకటించారు. నగర సంయుక్త కార్యదర్శులుగా దీక్షిత్, వంశీ, హరి, పూజ, మహిళా కన్వీనర్‌గా నిఖిత, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్‌గా అర్జున్, మళామంచ్ కన్వీనర్‌గా సాత్విక నియమితులయ్యారు. కార్యక్రమంలో సంఘం మెదక్, సిద్దిపేట జిల్లాల సంఘటనా మంత్రి లక్ష్మీపతి, నాయకులు పాల్గొన్నారు.

◆ **క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి**

మెదక్ కలెక్టరేట్: విద్యార్థులు క్రమశిక్షణతో ఉత్తమ విద్యనభ్యసించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ అన్నారు. మంగళవారం కళాశాలలో బీఎస్సీ, ఎంపీసీ, బీజేడ్సీ ప్రథమ సంవత్సర విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సింహారెడ్డి, అకాడమిక్ సమన్వయకర్త డా.శరత్‌రెడ్డి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ తిరుమలరెడ్డి, వెంకటేశ్వర్లు, నరేందర్, డాక్టర్ నాగేందర్, డా. శ్రీలత, డాక్టర్ విశ్వనాథం, డా. చంద్రశేఖర్, డా.వామనమూర్తి, సుధారాణి, నిదర్శిని, అంజయ్య పాల్గొన్నారు.

◆ **నీటి సరాఫరాపై అవగాహన**

చిన్నశంకరంపేట(మెదక్): మిషన్ భగీరథ నీటి సరాఫరాపై గ్రామ వాటర్‌మెన్‌లకు అవగాహన ఉంటేనే గ్రామంలో అందరికీ సమానంగా తాగునీరు అందించగలరని మిషన్ భగీరథ ఈఈ సంపత్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని మిషన్ భగీరథ వాటర్‌మెన్‌లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ జిల్లా అధికారులు నాగభూషణం, ఎంపీడీఓ దామోదర్, ఏఈ భిక్షపతి, శిక్షకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ **ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు**

తూప్రాన్: ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న వ్యక్తి నుంచి ఐదు వాహనాలు రికవరీ చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు. మంగళవారం నిందితుడి నుంచి మూడు టీవీఎస్ వాహనాలు, రెండు స్ప్లెండర్ ప్లస్ వాహనాలను రికవరీ చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

◆ **మున్సిపల్ కార్మికులకు హెల్త్‌క్యాంపు**

మెదక్ మున్సిపాలిటీ: మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కార్మికుల కోసం హెల్త్‌క్యాంపు నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని శానిటేషన్, పారిశుద్ధ్యం, వాటర్ సప్లయ్, తదితర శాఖల్లో పనిచేస్తున్న సిబ్బందికి బీపీ, షుగర్, రక్త పరీక్షలు, సీబీపీ, ఆర్ఎఫ్‌టీ, ఎల్ఎటీ రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఈ మహేశ్, హెల్త్ అసిస్టెంట్ మహేశ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ వెంకటేష్, వార్డు జవాన్లు, తదితరులు పాల్గొన్నారు.

◆ **పీఆర్‌టీయూ చేయూత**



చిలప్‌చెడ్(నర్సాపూర్): పీఆర్‌టీయూ తమ యూనియన్ సభ్యుల సంక్షేమానికి తోడుంటుందని పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీపాల్‌రెడ్డి, లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మండలంలోని బద్రియా తండాకు చెందిన ఉపాధ్యాయుడు జరప్ల శ్రీనివాస్ మృతి చెందాడు. దీంతో మృతుడి భార్యకు పీఆర్‌టీయూ టీఎస్ సభ్యులు రూ. లక్ష ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్, పత్రికా వర్గ సభ్యుడు వెంకట్‌రామ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264